ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

ప్రజలతో సమావేశమైన ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

దుండిగల్,ఆగస్టు 29 : ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిరంతరం కృషి చేస్తున్నామని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శంభీపూర్ రాజు అన్నారు. గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు శంభీపూర్‌లోని ఆయన కార్యాలయంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ బస్తీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఇందుకు ఎమ్మెల్సీ సానుకూలంగా స్పందించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను సత్వరమే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

రూ. 50 కోట్లు వెంటనే విడుదల చేయాలి

మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన బ్రాహ్మణ శ్రీ వైష్ణవ సేవా సమితి అధ్యక్షుడు కాండూరి నరేంద్రాచార్య

బాలానగర్, ఆగస్టు 29 : తెలంగాణ ప్రభుత్వం బ్రాహ్మణ పరిషత్తు కోసం కేటాయించిన రూ. 50 కోట్లను వెంటనే విడుదల చేయాలని కోరుతూ గురువారం మంత్రి శ్రీధర్‌బాబును కలిసి రాష్ట్ర బ్రాహ్మణ శ్రీ వైష్ణవ సేవా సమితి అధ్యక్షుడు కాండూరి నరేంద్రాచార్య వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకుపోయినట్లు తెలిపారు. వెంటనే నూతన పాలక మండలి ఏర్పాటు చేయాలని కోరామని తెలిపారు. బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తులో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల కాలపరిమితిని పొడిగించాలని కోరారు. ఉద్యోగులు జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

రహదారి నిర్మాణ పనుల పరిశీలన

మియాపూర్, ఆగస్టు 29 : ఆల్విన్ కాలనీ డివిజన్ ఫేజ్ 1లో రూ. 27 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ వెంకటేశ్‌గౌడ్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రహదారి నిర్మాణాన్ని నాణ్యతతో చేపట్టాలని, క్యూరింగ్ ప్రక్రియను అత్యంత పటిష్టంగా చేపట్టాలన్నారు. పనుల సందర్భంగా ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కార్పొరేటర్ సూచించారు. ఏఈ శ్రావణి సహా పార్టీ నేతలు, కాలనీ వాసులున్నారు.

వినాయక నిమజ్జనాలకు పకడ్బందీ ఏర్పాట్లు

రంగధాముని చెరువుగట్టుపై అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఎమ్మెల్యే కృష్ణారావు, జడ్సీ అపూర్వ్‌చౌహాన్

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కేపీహెచ్‌బీ కాలనీ, ఆగస్టు 29 : వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకునేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులను కోరారు. గురువారం కూకట్‌పల్లి రంగధాముని (ఐడీఎల్) చెరువుగట్టుపై వినాయక నిమజ్జన ఏర్పాట్లపై జీహెచ్ఎంసీ, పోలీస్, ట్రాఫిక్ పోలీస్, విద్యుత్, రెవెన్యూ, జలమండలి, అగ్నిమాపక, ఇరిగేషన్ ధికారులతో ఎమ్మెల్యే కృష్ణారావు, జడ్సీ అపూర్వ్ చౌహాన్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నగరంలో ట్యాంక్‌బండ్ తర్వాత అత్యధిక విగ్రహాలను నిమజ్జనం చేసే ఐడీఎల్ చెరువుగట్టుపై ఉత్సవాలలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా రోడ్లను బాగు చేయాలని, చెరువుగట్టుపై భారీ క్రేన్లను ఏర్పాటు చేయడంతో పాటు విద్యుత్ దీపాలను అందుబాటులోకి తేవాలని తెలిపారు. మూడో రోజు నుంచే వినాయక విగ్రహాల నిమజ్జనం ప్రారంభం కానుండటంలో ముందస్తుగా ఏర్పాట్లన్నీ పూర్తి చేయాలన్నారు. చెరువులలో వేసిన విగ్రహాలను వెంటనే తొలంగించాలని, మూడు అడుగుల లోపు చిన్న విగ్రహాలను నిమజ్జనం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. చెరువుగట్టుపై పూజా సామగ్రి వ్యర్థాలను ఎప్పటికప్పుడూ తొలగించి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. వేడుకలను తిలకించేందుకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని అన్నారు. నిమజ్జనం సందర్భంగా రాజకీయ పార్టీల బ్యానర్లు కట్టకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, నిమజ్జనాలు జరిగే చెరువుగట్టు రోడ్లలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. నిమజ్జనాలు ప్రశాంతంగా జరిగేలా కృషి చేయాలని తెలిపారు.

పేదల ఇండ్ల జోలికి వస్తే సహించేది లేదు : ఎంపీ ఈటల రాజేందర్

బాలానగర్, ఆగస్టు 29 : పేదల ఇండ్ల జోలికి వస్తే సహించేది లేదని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గం ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ పరిధి బోయిన్ చెరువును ఎంపీ ఈటల రాజేందర్, డివిజన్ కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ సందర్శించారు. ఈ సందర్భంగా గత 40 సంవత్సరాలకు పైబడి కూలీ చేసుకొని జీవిస్తున్నామని స్థానికులు వివరించారు. అప్పటి నుంచి మున్సిపల్ ట్యాక్స్ రసీదులు, విత్యుల్ బిల్లులు ఆయనకు చూపించారు. ప్రస్తుతం రెవెన్యూ విభాగం అధికారులు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధి అంటూ నోటీసులు ఇస్తున్నారని ఎంపీతో స్థానికులు వాపోయారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కూలీ చేసుకొని జీవించే నిరుపేదలు 1980 నుంచి ఇండ్లు కట్టుకొని నివాసముంటున్న వారికి ఇప్పుడి కాంగ్రెస్ ప్రభుత్వ నేతృత్వంలో రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేయడం శోచనీయమని అన్నారు. ఇక్కడి పేదలు ఇండ్లు కట్టుకున్నప్పుడు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వానికి కనిపించలేదా అని ఆయన ప్రశ్నించారు. 40 సంవత్సరాల కాలంగా ఇక్కడ ఉన్న ఇండ్లను హైడ్రా పేరుతో ఆటంకం కల్పిస్తామంటే ప్రజలు తిరగబడతారని పేర్కొన్నారు. అప్పటి రెవెన్యూ విభాగం అధికారులకు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధి తెలువదా అని ఆయన ప్రశ్నించారు. అధికారులు చేస్తున్న పొరపాటును గుర్తించకుండా ప్రభుత్వాలు పేదలపై విరుచుకు పడడం సరికాదన్నారు. హైడ్రా నిరుపేదలను వదిలి బడా బాబులపై తమ ప్రతాపాన్ని చూపించాలని హితవు పలికారు. గత కొన్ని సంవత్సరాలుగా ఇక్కడి ప్రజలకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించి ఇప్పుడు కూల్చివేస్తామంటే ఊరుకునేది లేదని పేర్కొన్నారు. కార్పొరేటర్ నర్సింహయాదవ్ మాట్లాడుతూ తాము ఎల్లప్పుడు నిరుపేదలకు అండగా నిలుస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మాధవరం కాంతారావు, స్థానిక నాయకులు, బాధితులు పాల్గొన్నారు.

హస్మత్‌పేట బోయిన్ చెరువును సందర్శించి స్థానికులతో మాట్లాడుతున్న మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, కార్పొరేటర్ నర్సింహయాదవ్

ఎంపీ ఈటల రాజేందర్‌ను సత్కరిస్తున్న చైర్‌పర్సన్ సుంకరిక్రిష్ణవేణికృష్ణ, పాలకవర్గం సభ్యులు

దుండిగల్ మున్సిపాలిటీ సాదారణ సర్వసభ్యసమావేశం

దుండిగల్, ఆగస్టు 29 : దుండిగల్ మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశం గురువారం సాదాసీదాగా జరిగింది. చైర్‌పర్సన్ సుంకరి క్రిష్ణవేణికృష్ణ అధ్యక్షతనజరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ అధ్యక్షతన సమావేశంలో చేపట్టవలసిన పనులు గురించి ప్రస్తావించారు. వాటికి కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు.అన్ని వార్డుల్లో డ్రైనేజీకి రూ.4.46 కోట్లు, సీసీ రోడ్లకు రూ.10.93 కోట్లు, శ్మశానవాటికల అభివృద్ధికి రూ.1.82 కోట్లు, కమ్యూనిటీ హాళ్లకు రూ. 1.40కోట్లు, మొత్తం రూ. 18 కోట్ల నిధులు కేటాయింపుకు మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. మున్సిపాలిటీ పరిధిలోని వివిధ గ్రామాలల్లో ఉన్న గ్రామ కంఠంలో ఉన్నటువంటి ఇండ్లను, తాసీల్‌దారు పరిశీలన చేసి గ్రామకంఠం సర్టిఫికెట్ ఇవ్వాలని ఏకగ్రీవంగా కౌన్సిల్ ఆమోదం తెలిపింది.అనంతరం ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ దుండిగల్ మున్సిపల్ అభివృద్ధికి తన వంతు సాయంగా నిధులు కేటాయిస్తానని అన్నారు. అనంతరం మొదటి సారిగా సభకు విచ్చేసిన ఎంపీ ఈటలను కౌన్సిల్ సత్కరించింది. ఈ సమావేశంలో వైస్‌చైర్మన్ తుడుము పద్మారావు, మున్సిపల్ కమిషనర్ కే సత్యనారాయణరావు, గండి మైసమ్మ-దుండిగల్ తాసీల్దార్ సయ్యద్ అబ్దుల్ మతిన్, కౌన్సిలర్లు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

వేంకటేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణారావు

బాలానగర్, ఆగస్టు 29 : శ్రీదేవి, భూదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి 23 కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. గురువారం బాలానగర్ డివిజన్ సగర ఉప్పర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి, ఫతేనగర్ కార్పొరేటర్ సతీశ్‌గౌడ్ హాజరై స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ రాజు సాగర్, సగర సంఘం అధ్యక్షుడు డి. లోకేశ్‌సాగర్, ప్రధానకార్యదర్శి జానకీరాములు సాగర్, కోశాధికారి రవిసాగర్, ఇందిరానగర్ అధ్యక్షుడు గిరిసాగర్, ప్రధాన కార్యదర్శి అర్జున్, కోశాధికారి రాజు, స్థానిక నాయకులు బంగారయ్య, రమేశ్, బాలాపీర్, దామోదర్, మన్యం సాగర్, గోపీసాగర్, చక్రవర్తి, పరశు, స్థానికులు పాల్గొన్నారు.

గణేశ నిమజ్జనాలపై అధికారులతో సమీక్ష

కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్

కుత్బుల్లాపూర్,ఆగస్టు 29 : గణేశ్ ఉత్సవాల సందర్భంగా జరిగే నిమజ్జన ఏర్పాట్లలో ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేయాలని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వచౌహాన్ అధికారులకు సూచించారు. గురువారం కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో జీహెచ్ఎంసీ, రెవెన్యూ, మెడికల్, ట్రాఫిక్, పోలీస్, ఫైర్ ఇతర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. చెరువుల సమీపంలో ఆయా విభాగాల నేతృత్వంలో అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తూనే ఉత్సవ కమిటీ నిర్వాహకులు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. డీసీలు నరసింహ, మల్లారెడ్డి, కుత్బుల్లాపూర్ మండల తాసీల్దార్ అబ్దుల్ రహమాన్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు, ఎస్ఈ చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

ట్రాఫిక్ నియమ నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజు హెచ్చరించారు. గురువారం అల్వాల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బొల్లారం ఎక్స్‌రోడ్డు చౌరస్తాతో పాటు సుచిత్ర చౌరస్తాలో రాంగ్ రూట్లో వచ్చిన సుమారు 22 ద్విచక్రవాహనాలను సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేశారు. అనంతరం రాంగ్‌రూట్లో వచ్చిన ద్విచక్రవాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్ఐ శ్యాంబాబు ఉన్నారు.

– కుత్బుల్లాపూర్, ఆగస్టు 29

షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ

చెక్కుల పంపిణీ అనంతరం లబ్ధిదారులతో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

మియాపూర్ , ఆగస్టు 29 : పేద యువతుల పెండ్లికి సీఎం రేవంత్‌రెడ్డి పెద్దన్నలా ఆర్థిక సాయం అందిస్తున్నారని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా 520 మందికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం కింద రూ. 5,20,60,000లను చెక్కుల రూపంలో కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్, మంజుల రఘునాథ్‌రెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే గాంధీ గురువారం క్యాంపు కార్యాలయంలో అందించారు. పార్టీ నేతలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సిగ్నళ్లు ప్రారంభం..

వివేకానందనగర్ కాలనీలో కాలనీ సెక్యూరిటీ కమిటీ ఆధ్వర్యంలో రూ. 10 లక్షల సొంత నిధులతో ఏర్పాటు చేసిన నూతన ట్రాఫిక్ సిగ్నళ్లను కార్పొరేటర్ మాధవరం రోజాదేవితో కలిసి ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. మాజీ కార్పొరేటర్ రంగారావు, కాలనీ ప్రతినిధులు వడ్డేపల్లి రాజేశ్వర్‌రావు, శివరాం ప్రసాద్, సత్యనారాయణ రెడ్డి, సత్యనారాయణ, వేణు, బాబు, చంద్రకాంత్‌రావు , కాలనీ వాసులు పాల్గొన్నారు.

వీఎన్ఆర్‌లో ఇన్‌డక్షన్ డే

కార్యక్రమంలో పాల్గొని ప్రసంగిస్తున్న దగ్గుబాటి సురేశ్‌బాబు

హాజరైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

దుండిగల్, ఆగస్టు 29 : వీఎన్ఆర్ విజ్ఞానజ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో గురువారం 30వ బ్యాచ్ విద్యార్థులకు స్వాగతం పలికింది. గురువారం కళాశాలలో జరిగిన ఇండక్షన్ కార్యక్రమానికి విజ్ఞాన జ్యోతి సంస్థ అధ్యక్షుడు దగ్గుబాటి సురేశ్‌బాబు ముఖ్యఅతిథిగా హాజరు కాగా, సంస్థ ప్రధానకార్యదర్శి జేఎస్. రావు, ఉపాధ్యక్షుడు కోడె దుర్గాప్రసాద్, సంయుక్త కార్యదర్శి అచ్యుతరామ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సురేశ్‌బాబు మాట్లాడుతూ.. ఈ వయసులో పెంపొందే స్నేహాలు కేవలం వినోదానికే పరిమితం కాకుండా కలిసికట్టుగా పనిచేస్తే ఎన్నో విజయాలు సాధించటానికి ఉపయోగడపతాయన్నారు. ప్రతీ సంవత్సరం 2,000 మంది విద్యార్థులను తీర్చిదిద్దడమే ధ్యేయంగా విద్యా సంస్థలను నడుపుతున్నామని, విద్యార్థులు ఉద్యోగసాధనే లక్ష్యంగా కాక ప్రపంచాన్ని మార్చాలనే తలంపుతో ఎదగాలన్నారు. జేఎస్.రావు కోడె దుర్గాప్రసాద్ సంచాలకులు డా.చెన్నకేశవరావు, డీన్ అకాడమిక్స్ డా.కే అనురాధ తదితరులు మాటాడారు. కళాశాల సిబ్బందితో పాటు కళాశాలలో మొదటిసంవత్సరంలో చేరిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శ్రీ విజయ గణపతి ఆలయ ప్రథమ వార్షికోత్సవం

కేపీహెచ్‌బీ కాలనీ 9వ ఫేజ్‌లోని శ్రీ విజయ గణపతి ఆలయ ప్రథమ వార్షికోత్సవ పూజలు వైభవంగా జరుగుతున్నాయి. వేడుకలలో భాగంగా గురువారం మండప దేవతా హోమాలు మూలమంత్ర హోమం, పూర్ణాహుతి, అవభృత స్నానం తదితర పూజలు జరిగాయి. భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వర్‌రావు ప్రవచనాలు ఆకట్టుకున్నాయి. ఆయల కమిటీ చైర్మన్, కేపీహెచ్‌బీ కాలనీ డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

– కేపీహెచ్‌బీ కాలనీ, ఆగస్టు 29

వినాయక నిమజ్జనాలకు ఏర్పాట్లు చేయాలి

శేరిలింగంపల్లి, ఆగస్టు 29 : జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో గురువారం పర్యటించారు. సర్కిల్ పరిధిలోని రాయదుర్గం మల్కంచెరువు, లింగంపల్లి గోపిచెరువు, నలగండ్ల చెరువులను అధికారులతో కలిసి పరిశీలించారు. రాయదుర్గం మల్కంచెరువులో ఆయిల్‌బాల్స్, గంబూసాయ చేపపిల్లలను విడిచారు. వినాయక నవరాత్రుల నేపథ్యంలో నిమజ్జన ఏర్పాట్లకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. వీధిదీపాల మరమ్మతులు, క్రేన్లు, జనరేటర్ల ఏర్పాట్లకు చేపట్టాల్సిన చర్యల గురించి చర్చించారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంలో వ్య వహరించి నిమజ్జనానికి వ చ్చేవారికి సమస్యలు లేకుం డా చూడాలన్నారు. లింగంపల్లి గోపిచెరువులో కొనసాగుతున్న పనుల విషయమై కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్‌ను అడిగి తెలుసుకున్నారు. వెస్ట్‌జోన్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, డీసీ ము కుంద్‌రెడ్డి, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

గంగారం చెరువు వద్ద వినాయక నిమజ్జనాల ఏర్పాట్లపై మాట్లాడుతున్న మేయర్ విజయలక్ష్మి, కార్పొరేటర్ మంజుల

గంగారం చెరువు సందర్శన..

కొండాపూర్ : చందానగర్ డివిజన్‌లోని గంగారం చెరువును స్థానిక కార్పొరేటర్ మంజుల రఘునాథ రెడ్డితో కలిసి మేయర్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా చెరువులో కొనసాగుతున్న గుర్రపుడెక్క తొలగింపు, నిమజ్జన కోనేరు శుభ్రం చేసే పనులను పరిశీలించారు. ఇరిగేషన్ డీసీ సురేశ్, ఎంటమాలజీ, ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది, నాయకులు రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

మియాపూర్ గుర్నాథం చెరువు వద్ద వినాయక నిమజ్జన పరిస్థితులపై సమీక్షిస్తున్న మేయర్ విజయలక్ష్మి, జడ్సీ ఉపేందర్‌రెడ్డి

గణేశ్ ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలి..

మియాపూర్ : వచ్చే నెలలో జరగనున్న గణేశ్ ఉత్సవాలతో పాటు నిమజ్జనానికి అత్యంత పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీలు, ఇంజినీరింగ్, పారిశుధ్యం , పట్టణ ప్రణాళిక, ఎంటమాలజీ విభాగాలతో పాటు ఆయా డివిజన్‌ల కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్, గంగాధర్‌రెడ్డి, రాగం నాగేందర్‌యాదవ్, పుష్పనగేశ్‌యాదవ్, మంజులరెడ్డి, పూజిత, హమీద్ పటేల్ ఉన్నారు.

విద్యుత్ సమస్యలకు సత్వర పరిష్కారం..

మేడ్చల్ డీఈ శ్రీనాథ్‌రెడ్డిని సత్కరిస్తున్న ఎంఎన్‌రెడ్డినగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు

కుత్బుల్లాపూర్,ఆగస్టు 29 : ప్రజలకు విద్యుత్ సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నానని విద్యుత్ శాఖ మేడ్చల్ డీఈ శ్రీనాథ్‌రెడ్డి అన్నారు. ఇటీవల జీడిమెట్ల డివిజన్‌లో పలు కాలనీల్లో విద్యుత్ సమస్యపై డీఈ కార్యాలయం ముందు నిరసన చేయగా స్పందించిన డీఈ సకాలంలో ఆయా కాలనీల్లో నెలకొన్న విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారు. దీంతో హర్షం వ్యక్తం చేస్తూ గురువారం ఎంఎన్‌రెడ్డినగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సంపత్‌గౌడ్ నేతృత్వంలో డీఈని మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కాలనీ వెల్ఫేర్ జరనల్ సెక్రటరీ రవీందర్‌గౌడ్, కోశాధికారి కరుణాకర్‌రెడ్డి, బాపిరెడ్డి, పాండు, సత్తయ్యగౌడ్, నవీన్‌రెడ్డి, గోపి, రంగారెడ్డి, కృష్ణమూర్తితో పాటు ఆయా కాలనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులను వేగతంతం చేయాలి

కేపీహెచ్‌బీ కాలనీ, ఆగస్టు 29 : వర్షాకాలం నేపథ్యంలో సీసీ రోడ్డు పనులను త్వరగా పూర్తిచేయాలని మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు అన్నారు. గురువారం బాలాజీనగర్ డివిజన్‌లోని ప్రగతినగర్ వసుందర వైద్యశాల మార్గంలో సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రోడ్డు పనులు చేస్తున్నప్పుడే మ్యాన్‌హోల్స్‌కు మరమ్మతులు చేయాలన్నారు. కార్యక్రమంలో స్థానిక నేతలు నాయుడు, జిల్లా గోపాల్, భాస్కర్‌రావు, శారద తదితరులు ఉన్నారు.

గిడుగు రామ్మూర్తి జయంతి

వ్యవహారిక భాష కోసం జీవితమంతా ధారబోసిన గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని గురువారం గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య పిల్లలమర్రి రాములు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. భాషలోని అన్ని వాగ్రూపాలకు సముచిత గౌరవం, అన్ని మాండలికాలు గౌరవనీయమే అంటూ ఎంతో మంది పండితులను ఒప్పించి వ్యావహారిక భాషకు గౌరవాన్ని తెచ్చిన గొప్ప భాషా సంస్కర్త రామ్మూర్తి అని ఆచార్య రాములు అన్నారు.

– కొండాపూర్, ఆగస్టు 29

సబ్‌కాంట్రాక్ట్ ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

కుత్బుల్లాపూర్, ఆగస్టు 29 : కేంద్ర ప్రభుత్వ రంగం విభాగాల్లో సబ్‌కాంట్రాక్ట్ ఇప్పిస్తానని డబ్బులు తీసుకొని ఉడాయించిన నిందితుడిపై పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. కేహెచ్ ఇన్‌ఫ్రాటెక్ న్యూఢిల్లీ ప్రొఫెటర్ హిమాన్స్‌డింగ్రేతో సుచిత్ర ప్రాంతానికి చెందిన శ్రీనివాసమూర్తికి కొన్నెండ్ల కిందట పరిచయం ఏర్పడింది. కేంద్ర సంస్థల్లో ఎలక్ట్రికల్, మ్యాన్‌పవర్ సప్లై, ఎలక్ట్రికల్ మీటర్, కేబుల్ వర్క్‌లు, ఆయుష్మాన్‌భారత్ హెల్త్ కార్డుల ప్రాజెక్ట్‌లో తనకు కాంట్రాక్ట్ ఉందని, తెలంగాణ, ఏపీలలో కూడా చేయాలంటే తనవద్ద సబ్ కాంట్రాక్ట్ తీసుకుంటే డబ్బులు సంపాధించుకునేందుకు అనువుగా ఉంటుందని నమ్మించాడు. దీంతో కొంపల్లిలోని స్వాగత్‌గ్రాండ్‌లో హిమాన్స్‌డింగ్రేకు శ్రీనివాసమూర్తి ఇతరులతో కలిసి రూ.35 లక్షల వరకు అప్పగించారు. రోజులు కావస్తున్నా తప్పించుకొని తిరుగుతుండడంతో అనుమానం వచ్చి ఆరాతీయగా మోసపోయామని గుర్తించారు. బాధితుడు శ్రీనివాసమూర్తి పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో ఢీకొని మృద్ధుడు మృతి

అల్లాపూర్, ఆగస్టు29 : వృద్ధుడిని ఆటో ఢీకొట్టడంతో ఆసుపత్రిలో చికిత్సపొందతూ.. మృతి చెందిన ఘటన కేసీహెచ్‌బీ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం..నిజాంపేట భవ్యాస్ అనందం అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న సీఎస్ నరసింహారావు(75)రిటైడర్డ్ ఉద్యోగి. బుధవారం సాయంత్రం కూరగాయలు కొనేందుకు ఇంటి నుంచి బయటకు వచ్చాడు. నిజాంపేట కమాన్ వద్ద రోడ్డు దాటుండగా వేగంగా వచ్చిన ఆటో ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో తీవ్రగాయాల పాలైన నరసింహారావును చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొన దర్యాప్తు చేస్తున్నారు.

డ్రగ్స్ నియంత్రణ, నేరాలపై అవగాహనకు చర్యలు

పీజేఆర్ స్టేడియంలో బెలూన్లు ఎగరవేసి వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న మాదాపూర్ డీసీపీ వినీత్

కొండాపూర్, ఆగస్టు 29 : డ్రగ్స్ నియంత్రణ, నేరాల పట్ల యువతలో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మాదాపూర్ జోన్ డీసీపీ వినీత్ జీ అన్నారు. అవగాహన కార్యక్రమంలో భాగంగా మాదాపూర్ జోన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్ టోర్నమెంట్‌ను గురువారం ఆయన చందానగర్‌లోని పీజేఆర్ స్టేడియంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... డ్రగ్స్ నియంత్రణతో పాటు నేరాల పట్ల అవగాహన కల్పించేందుకు సైబరాబాద్ సీపీ ఆదేశాల మేరకు జోన్లలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువతకు క్రీడా పోటీలను నిర్వహిస్తూ.. వారిలో డ్రగ్స్ నియంత్రణ, నేరాల పట్ల అవగాహనను కల్పిస్తున్నామని, జోన్‌ల వ